క్లుప్తంగా

స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.నాగమునినాయక్ తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంట్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, మెటలర్జీ ఇంజనీరింగ్ విభాగాల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. వివరాల కోసం 98853 30625, 98858 22327 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అధ్యాపకుల నియామకానికి..

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్రం, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ సబ్జెక్టులలో కాంట్రాక్టు పద్ధతిపై బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ సోమవారం తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో, ఇతరులు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ నెల 27వ తేదీన సాయంత్రం 4 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

సూపర్‌బజార్(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండలంలో ట్రైకార్ రుణాల పేరిట అవినీతి జరిగిందని ఆరోపిస్తూ బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించమే కాకుండా అధికారులు అవినీతికి పాల్పడ్డారని, దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, పాల్వంచ బస్టాండ్ అభివృద్ధి పనులను ప్రారంభించాలని విన్నవించారు. నాయకులు గంధం మల్లికార్జున్‌రావు, నాగుల రవికుమార్, గుడివాడ రాజేందర్, కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, గుగులోత్ రాహుల్ పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు..

ఇల్లెందు: ఇంటి అనుమతులు ఇప్పిస్తామని వచ్చే దళారులను నమ్మి ప్రజలు మోసపోవద్దని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ దళారులు సులభంగా ఇంటి అనుమతులు ఇప్పిస్తామని చెప్పి డబ్బు వసూళ్లకు పాల్పడుతారని చెప్పారు. అయితే, టీఎస్‌బీపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సులభంగా అనుమతులు జారీ అవుతున్నందున ఎవరి మాట నమ్మొద్దని కోరారు. కాగా, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఇళ్లలోనే కాకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని చైర్మన్ సూచించారు. సమావేశంలో డీఈ నవీన్, టీపీఓ అవినాష్, టీపీఎస్ సతీశ్, ఏఈ కుమారస్వామి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను సోమవారం జీఎం జాన్‌ఆనంద్ ఆధ్వర్యాన సన్మానించారు. సూర్యకుమార్, ఎల్‌వీ గణపతిరావు, స్వామినాయుడును సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మల్లారపు మల్లయ్య, పంజాల శ్రీనివాస్, గిరిధర్‌రావు, ప్రభాకర్‌రావు, బొల్లం వెంకటేశ్వర్లు, వెంకటరామచంద్ర, జీవీ మోహన్‌రావు, విజయభాస్కర్, దిలీప్‌కుమార్, ధనుంజరెడ్డి, మల్లారెడ్డి, మహేశ్, యూసుఫ్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఫిట్ కార్యదర్శిగా హుమాయిన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని పీవీకే-5 షాఫ్ట్ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఫిట్ కార్యదర్శిగా హుమాయిన్ ఎంపికయ్యారు. సోమవారం గని ఆవరణలో జరిగిన సమావేశంలో కార్యదర్శిగా హుమాయిన్‌తో పాటు 16 మందితో కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు ఎస్.నాగేశ్వరరావు, మిర్యాల రంగయ్య, గనిగల్ల వీరస్వామి, వట్టికొండ మల్లికార్జున్‌రావు, తోట రాజు, రామచందర్, గట్టయ్య, సుధాకర్, కత్తెర్ల రాములు, దేవీసింగ్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల ర్యాలీ

ఇల్లెందురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపిస్తూ మండల యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో సోమవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ జిల్లా కార్యదర్శులు భాగ్యారావు, జయరాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యావిధానంలో వ్యాపారం, కాషాయీకరణ పెంచి పోషించేదిగా ఉందని ఆరోపించారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని, ఓపీఎస్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమ్మయ్య, ఇమ్మాన్యుయేలు, రాంబాబు, కొడెం కృష్ణ, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పాఠశాలలో హెల్త్ క్యాంపు

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాల(ఏజీహెచ్ఎస్)లో సోమవారం పీహెచ్‌సీ ఆధ్వర్యాన హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు బాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏజీహెచ్ఎస్ హెచ్ఎం సుభద్రమ్మ, ఉద్యోగులు రత్నకుమార్, కృష్ణ, ఆదిలక్ష్మి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

‘అతిథి’ నిరాదరణ

- దెబ్బతింటున్న బ్రిటీష్ కాలం నాటి భవనాలు
- మరమ్మతులు మరిచిన ప్రభుత్వ శాఖలు
- ఇదీ ఇల్లెందులో గెస్ట్‌హౌజ్‌ల దుస్థితి



మరమ్మతులకు నోచుకోని బ్రిటీష్ కాలం నాటి గెస్ట్ హౌజ్

ఇల్లెందు: దేశాన్ని బ్రిటీష్ వారు పాలించిన కాలంలో ఇల్లెందు ప్రాంతంలో బొగ్గు అన్వేషణ కోసం వచ్చారు. ఆ కాలంలోనే నివాసానికి బంగ్లాలేక పాఠశాలలు, ఆస్పత్రులు నిర్మించారు. బ్రిటీష్ పాలన ముగిశాక ప్రభుత్వ శాఖల గెస్ట్‌హౌస్‌లుగా మారిన ఆయా భవనాల నిర్వహణ, మరమ్మతులను అధికారులు మరిచిపోయారు. దీంతో ఇల్లెందు గోవింద్‌సెంటర్‌లో ఆర్‌అండ్‌బీ, అటవీ శాఖల ఆధీనంలో ఉన్న అతిథిగృహాలు శిథిలావస్థకు చేరాయి. ఫలితంగా అధికారులైనా ప్రజాప్రతినిధులైనా సరే ఇప్పుడు సింగరేణి గెస్ట్‌హౌజ్‌నే ఆశ్రయిస్తున్నారు. అది ఖాళీ లేకపోతే పట్టణంలో సరైన లాడ్జీలు కూడా లేక ఇక్కట్లు ఎదురవుతున్నాయి.

నాడు అన్వేషణ.. నేడు పాలన

ఒకనాడు బ్రిటీష్ అధికారులు ఈ ప్రాంతానికి బొగ్గు అన్వేషణ, బొగ్గు వెలికితీసే పనుల పర్యవేక్షణ కోసం వచ్చేవారు. అలా వారి కోసం నిర్మించిన అతిథి గృహాలు ఇప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులకు విశ్రాంతి తీసుకునేందుకు ఉపయోగడ్డాయి. నాటి నుంచి నేటి వరకు ఎందరో అధికారులు ఈ ప్రాంతానికి అధికారిక పర్యటనలకు వచ్చిన సందర్భంగా ఈ అతిథి గృహాల్లోనే విశ్రాంతి తీసుకునేవారు.

సదుపాయాలు ఉన్నా పర్యవేక్షణ సున్నా

ఆర్‌అండ్‌బీ, ఫారెస్టు గెస్ట్ హౌజ్‌లకు అనేక సదుపాయలున్నాయి. వందల వాహనాలు పార్కింగ్ చేయగలిగే విశాలమైన స్థలం, నీటి సౌకర్యంతో పాటు ఫర్నిచర్ ఇతరత్రా అన్నీ అందుబాటులో ఉన్నాయి. కానీ కేవలం పర్యవేక్షణ లేక, చిన్నచిన్న మరమ్మతులు కూడా చేయకపోవడంతోనే ఆయా భవనాలు శిథిలావస్థకు చేరాయి. కనీసం కూలిన ప్రహరీలను కూడా మరమ్మతు చేయకపోవడంతో పశువులు ఆవాసంగా మార్చుకోగా.. పిచ్చిమొక్కలు పెరిగి చిన్న పాటి అడవులను తలపిస్తున్నాయి. ఇకనైనా అటు అటవీశాఖ, ఇటు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు దృష్టి సారించాలని గెస్ట్ హౌజ్‌లను మరమ్మతు చేయించాలనే డిమాండ్ వినిపిస్తోంది.



కూలిపోయిన ప్రహరీ

మరమ్మతులు చేయాలి..



సుదీర్ఘ చరిత్ర కలిగిన ఇల్లెందులో కనీసం గెస్ట్ హౌజ్ లేకుండా పోయింది. అన్ని సౌకర్యాలు కలిగిన గెస్ట్‌హౌజ్‌లు ఉన్నా కనీస మరమ్మతులు లేక నిరుపయోగంగా మారాయి. కొత్తవి నిర్మించకపోయినా ఉన్న వాటినైనా పరిరక్షించాలి.

–బుర్ర వెంకన్న,
ప్రజాపంథా నాయకుడు, ఇల్లెందు

పాత వాటిని సంరక్షించాలి..



బ్రిటీష్ కాలంలో నిర్మించిన భవనాలు ఇంకా బాగానే ఉన్నాయి. కొద్దిపాటి నిధులతో చిన్నచిన్న మరమ్మతులు చేయిస్తే అందుబాటులోకి వస్తాయి. ఇలాంటి వాటి మరమ్మతులపై అధికారులు స్పందిస్తే అందరికీ ఉపయోగంలోకి వస్తాయి.

–పూనెం సురేందర్,
ఎంపీటీసీ, ఇల్లెందు

ప్రతిపాదనలు పంపాం..



ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ మరమ్మతులకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం. అలాగే, నూతన గెస్ట్ హౌజ్ నిర్మాణం కోసం కూడా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే మరమ్మతు చేస్తాం.

–వడ్లమూడి వెంకటేశ్వరరావు,
డీఈ, ఆర్‌అండ్‌బీ, ఇల్లెందు

మణిపూర్ ఘటనకు కారకులను శిక్షించాలి

ఇల్లెందురూరల్: మణిపూర్ ఘటనకు కారకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మండలంలోని చల్లసముద్రం, మిట్టపల్లి గ్రామాల్లో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ నాయకురాలు కల్తీ కోటమ్మ మాట్లాడుతూ.. సభ్యసమాజం తలదించుకునేలా మణిపూర్‌లో జరుగుతున్న హింసకు బీజేపీ ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. కార్యక్రమంలో పడిగ రామలక్ష్మి, రాణి, నర్సమ్మ, కావత, రవళి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ హింస బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రే..

కొత్తగూడెంటౌన్: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతల కుట్ర కారణంగానే మణిపూర్‌లో కుకి జాతి ప్రజలపై హింస జరుగుతోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో భారత్ బచావో జిల్లా చైర్మన్ బత్తుల కృష్ణయ్య ఆధ్వర్యాన సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్యతో పాటు సీనియర్ నాయకుడు తాళ్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మణిపూర్‌లోని కొండ ప్రాంతాల్లో విలువైన ఖనిజ సంపద ఉండడంతో కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకు కేంద్రం గిరిజనులను దూరంగా తరిమేందుకు కుట్ర పన్నిందని ఆరోపించారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు తాండ్ర వెంకటేశ్వర్లు, చార్వాక, ఎస్.వెంకటేశ్వర్లు, నాయకులు ఎట్టి ప్రశాంత్, పూల రవీందర్, జోగు రాంబాబు, జోగారావు, శౌరి, పాల్, శ్రీనివాసరెడ్డి, లిక్కి బాలరాజు, మారపాక రమేశ్ పాల్గొన్నారు.

ఎస్సైగా గిరిధర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ఇల్లెందురూరల్: కొమరారం ఎస్సైగా బి.గిరిధర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్సైగా ఉన్న శివరామకృష్ణ అశ్వారావుపేటకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఖమ్మం సీపీఎస్‌లో పనిచేస్తున్న గిరిధర్‌రెడ్డిని కేటాయించారు.

వైరా తరలిన శ్రేణులు

జూలూరుపాడు: వైరా నియోజకవర్గ కేంద్రంలో సోమవారం జరిగిన మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు జూలూరుపాడు నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ వేర్వేరుగా బయలుదేరారు. కాగా, జూలూరుపాడు నుంచి మదన్‌లాల్ తన అనుచర గణంతో ర్యాలీగా వెళ్లారు. నాయకులు యల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు, ఎదళ్లపల్లి వీరభద్రం, జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ, పొన్నెకంటి సతీశ్‌కుమార్, చౌడం నరసింహారావు, మోదుగు రామకృష్ణ, దుద్దుకూరి నాగేశ్వరరావు, చావా వెంకటరామారావు, నల్లపాటి రామారావు, నాగేశ్వరరావు, బాలాజీ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

పాల్వంచరూరల్: మండలంలోని ఉల్వనూరు, మల్లారం, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో సోమవారం ఉల్వనూరు వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. పలు ఇళ్లల్లో దోమ లార్వాను గుర్తించి తొలగించారు. మంగళ, శుక్రవారం డ్రైడే నిర్వహించడం వల్ల దోమల పెరుగుదలను నియంత్రించే అవకాశం ఉందని వైద్యసిబ్బంది చెప్పారు. కార్యక్రమంలో జేతురామ్, కనకదుర్గ, సురేశ్, చైతన్య, వెంకట్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ బాధ్యులు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/ఇల్లెందు: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాను టీఎన్జీవోస్ బాధ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమరనేని రామారావు, సాయి భార్గవచైతన్యతో పాటు జె.సోమయ్య, జి.వీరబాబు, సీహెచ్.రామనర్సయ్య, జానీమియా, విజయలక్ష్మి, జి.ఉష, రవి, ఉషారాణి, జి.ప్రకాశ్, ఇమ్రాన్‌పాషా పాల్గొన్నారు. అలాగే, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కూడా కలెక్టర్‌ను కలిసి ప్రగతి నివేదికను అందజేశారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీవోస్ బాధ్యులు

కలెక్టర్‌ను కలిసిన చుంచుపల్లి అధికారులు

చుంచుపల్లి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాను సోమవారం చుంచుపల్లి మండలానికి చెందిన పలువురు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌ను మండల పంచాయతీ అధికారి గుంటి సత్యనారాయణ కలిసి అభినందనలు తెలిపారు.

సూపర్‌వైజర్ నియామకం సరికాదు..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా ప్రైవేట్ సెక్యూరిటీ విభాగంలో సీనియర్లను కాదని జూనియర్‌ను సూపర్‌వైజర్‌గా నియమించడం సరికాదని పలువురు పేర్కొన్నారు. సోమవారం జూనియర్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఏళ్లుగా పనిచేస్తున్న తమను కాదని ఇటీవలే చేరిన జూనియర్ సెక్యూరిటీ గార్డును సూపర్‌వైజర్‌గా నియమించిన అంశంపై దృష్టి సారించాలని కోరారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

ఐటీశాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. పలుచోట్ల రక్తదానం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు బ్రెడ్లు, పాలు, పండ్లు అందించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కేటీఆర్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని నాయకులు కొనియాడారు.

–సాక్షినెట్‌వర్క్



ఇల్లెందు: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే హరిప్రియ



సుజాతనగర్: కేక్ కట్ చేస్తున్న నాయకులు



పాల్వంచ: బ్రెడ్ పంపిణీ చేస్తున్న నాయకులు



చుంచుపల్లి: నినాదాలు చేస్తున్న నాయకులు



కొత్తగూడెంఅర్బన్: కేక్ కట్ చేస్తున్న దిండిగాల



టేకులపల్లి: కేక్ కట్ చేస్తున్న నాయకులు

కొనసాగుతున్న జీపీ కార్మికుల నిరసన



చుంచుపల్లి: భిక్షాటన చేస్తున్న కార్మికులు



పాల్వంచరూరల్: మాట్లాడుతున్న పూర్ణచందర్

చుంచుపల్లి: గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో భాగంగా 19వ రోజు సోమవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ సెంటర్, విద్యానగర్ ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో దుర్గరాశి వెంకన్న, వాసిరెడ్డి మురళి, దుంపల అమర్‌నాథ్, కిశోర్‌కుమార్, మంజుల, వెంకన్న, ప్రవీణ్, సలీం, అనిల్, ఐలయ్య, నాగేశ్వరరావు, సరోజ, పూర్ణ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట 19 రోజులుగా జీపీ కార్మికులు సమ్మె చేస్తుండగా శిబిరాన్ని సోమవారం సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు గోనేల రమేశ్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ముడుపు ఉపేంద్రాచారి, చంచలపురి శ్రీను, రెడ్డిమల్ల భిక్షం, ఎన్.పూర్ణచందర్‌రావు, భద్రు, తులసీరామ్, నరేశ్, కల్యాణ్ పాల్గొన్నారు.



సుజాతనగర్: మద్దతు తెలుపుతున్న నాయకులు

సుజాతనగర్‌లో..

సుజాతనగర్: పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా సందర్శించారు. సమ్మె విచ్ఛిన్నం కోసం కాకుండా పరిష్కారం కోసం కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా పీరీల వేడుక

టేకులపల్లి: కుల మతాలకు అతీతంగా మండలంలో పీరీల వేడుకలు నిర్వహించారు. ఈ నెల 29న మొహర్రం పండుగను పురస్కరించుకుని ముందుగా పది రోజులపాటు ఆషిర్‌ఖానా (పీరీలకొట్టం) వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. టేకులపల్లి మండలంలో మూడుతండా, బోడు, గులాయిగడ్డ, కొత్తతండా(పి), కోయగూడెం, మద్రాస్‌తండా తదితర గ్రామాల్లో ప్రతి సంవత్సరం మొహర్రం సందర్భంగా పీరీల వేడుకలు నిర్వహిస్తారు. మండలంలో బంజారాల ఆధ్వర్యంలోనే పీరీల వేడుకలు జరుగుతుండటం విశేషం.

ప్రత్యేక పంచాయతీ కోసం ప్రజావాణిలో వినతి

సుజాతనగర్: సర్వారం గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాతండా గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని కోరుతూ గ్రామ యువకులు ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి కావాల్సిన అన్ని అర్హతలు గోపాతండాకు ఉన్నాయని, గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించకపోవడంతో రాజకీయ, ఉద్యోగ, ఆర్థికపరమైన అవకాశాలు కోల్పోతున్నట్లు చెప్పారు. 1,200 జనాభా కలిగిన తమ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తించాలని పేర్కొన్నారు. జరుపుల కుమార్, మాలోత్ రమేశ్ పాల్గొన్నారు.

దళితులకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలి

కొత్తగూడెంరూరల్: శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లలో నివసిస్తున్న దళితులకు వెంటనే పక్కా ఇళ్లు మంజూరు చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పాత కొత్తగూడెంలో కాంగ్రెస్ హయంలో 35 ఏళ్ల కిందట దళితులకు అందజేసిన ఇందిరమ్మ ఇళ్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఇళ్లు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉండగా.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయిస్తామన్న ప్రజాప్రతినిధుల హామీ నెరవేరలేదని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు జేబీ శౌరి, అల్లాడి నరసింహారావు, మహ్మద్ గౌస్, మేకల ప్రకాష్‌రావు, మందా హన్మంతు, కూసపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

హక్కుల కోసం స్వతంత్రంగా పోరాడుతాం



సెర్ప్ కార్యాలయంలో సమావేశమైన వీఓఏలు

ఇల్లెందురూరల్: న్యాయబద్ధంగా తమకు ప్రభుత్వం కల్పించాల్సిన హక్కుల కోసం స్వతంత్రంగా ఉద్యమిస్తామని మండలంలోని సెర్ప్ పరిధిలోని వీఓఏలు స్పష్టం చేశారు. ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం సమావేశమైన వీఓఏలు విలేకరులతో మాట్లాడారు. గతంలో తాము సీఐటీయూ అనుబంధంగా ఉన్నామని, ఇకమీదట ఆ సంఘంతో తమకు ఎలాంటి సంబంధం ఉండబోదని స్పష్టం చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నవ్య, ఉపాధ్యక్షులుగా లత, ప్రధాన కార్యదర్శిగా మోతీలాల్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పాపారావు, కార్యదర్శిగా వసంతరావు, కోశాధికారిగా నీలాబాయ్‌లతోపాటు మరో పది మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సుజాతనగర్: రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీల్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య మాట్లాడుతూ రుణమాఫీ కాకపోవడంతో వ్యవసాయ అవసరాల కోసం రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఉడుగుల శ్రీకాంత్, నాయకులు నల్లగోవ పుల్లయ్య, రాంబాబు, శ్రీధర్‌రాజు, రైతులు లింగయ్య, బాబా, మల్లయ్య, వెంకయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పండ్ల తోటల పెంపకం చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు

పాల్వంచరూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టాలని ఎంపీడీఓ బి.అప్పారావు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పండ్ల తోటల పెంపకంపై ప్రభుత్వం రాయితీలు అందిస్తోందని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ పోరండ్ల రంగా పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయం

టేకులపల్లి: మండలంలోని తడికలపూడికి చెందిన పదో తరగతి విద్యార్థి కల్తీ భరత్ (15) ఈ నెల 17న రాత్రి పాము కాటుకు గురై మృతి చెందాడు. సోమవారం కాంగ్రెస్ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు సోమవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. నాయకులు భుక్యా దేవానాయక్, పులి సైదులు, పూకే సత్యం, మీనం శ్రీనివాసరావు, జీవీ భద్రం, రమేశ్ పాల్గొన్నారు.

వైండింగ్ ఇంజన్ ఆపరేటర్ల కొరత

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధి పీవీకే-5 షాఫ్ట్ గనిలో వైండింగ్ ఇంజన్ ఆపరేటర్ల కొరత వేధిస్తోంది. దీంతో ఒకే ఆపరేటర్ వరుసగా రెండు, మూడు షిఫ్టులు విధులు నిర్వర్తించాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈ గనిలో సుమారు 760 మంది కార్మికులకు గాను డిప్యూటేషన్, గైర్హాజరు పోగా 360 మంది పనిచేస్తున్నారు. వైండింగ్ ఇంజన్ ఆపరేటర్ల కొరత ఉన్నందున ఇందులో కొందరిని ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాల్సి ఉన్నా అటు అధికారులు, ఇటు గని మేనేజర్, ఏజెంట్ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొత్తగూడెం ఏరియాలో ఆపరేటర్ల అవసరం ఉన్నప్పటికీ ఇటీవల శిక్షణ పొందిన ఉద్యోగిని ఇతర ఏరియాకు బదిలీ చేశారనే విమర్శలు వస్తున్నాయి.